క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని కలిసిన నాయకులు



వేల్పూర్: మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని వేల్పూర్ మండల బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అంతేగాక ఎమ్మెల్యే దంపతులకు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మోతె బీఆర్‌ఎస్ నాయకుడు దొల్ల రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏఎంసీ పాలకవర్గం



వేల్పూర్: కాంగ్రెస్ అగ్రనాయకులను వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముప్కాల్, బాల్కొండ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మగ్గిడి ముత్యంరెడ్డి, వెంకటేశ్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ జి.డి.రవి పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆలయాలు



ఆర్మూర్‌టౌన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆర్మూర్ పట్టణంతో పాటు మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తులు ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని నవనాథ సిద్దేశ్వరుడిని దర్శించుకోవడానికి నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బోధన్: ఉమ్మడి రాష్ట్ర దివంగత సీఎం నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) అభిమాన సంఘం బోధన్ శాఖ నూతన కమిటీ బుధవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా పల్లెంపాటి శివనారాయణ, ఉపాధ్యక్షులుగా సాంబిరెడ్డి, కోట గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి గాంధీ, సహాయ కార్యదర్శులుగా యేశాల రవీందర్, బి కృష్ణారెడ్డి, కోశాధికారిగా కృష్ణ మోహన్, కార్యవర్గ సభ్యులుగా పామేశ్వర్‌రావు, పాండురంగారెడ్డి, బాల్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, బాలస్వామి, సూరిబాబు, రామారావు, రావెళ్ల శ్రీనివాస్, ఎం పెద్ద బ్రహ్మయ్య, సుధాకర్, పావులూరి వెంకటేశ్వర్‌రావు, సలహాదారులుగా ఎం అమర్‌నాథ్‌బాబు, తూము శరత్‌రెడ్డి, రాజేశ్వర్ పటేల్ ఎన్నికయ్యారు.

ఎస్సైకి సన్మానం



వేల్పూర్: మండలానికి నూతనంగా వచ్చిన ఎస్సై సంజీవ్‌ను వేల్పూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, టీఆర్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి ఎస్సైని శాలువతో ఘనంగా సన్మానించారు. వారి వెంట నాయకులు ఉన్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, భూపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగులతో జరిపిన చర్చల్లో ఆర్థికపరమైన అంశాలపై స్పష్టత ఇవ్వలేదన్నా రు. తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, హరికృష్ణ, మరిపెల్లి భూపతిఅశోక్, సత్యానంద్, రమేశ్, గంగాధర్, మల్లేశ్, సాయన్న, ఆనందం, గంగాధర్, జనార్దన్, భోజన్న, రాజారాం, శంకర్, వెంకటరమణ, గంగప్రసాద్, శ్రీనివాస్, ముత్యంరెడ్డి, రఘు, భోజన, రాజేశ్వర్, జయసాగర్, శారదా గోనె తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల కొరత.. రోగుల కలత

- బాల్కొండ ప్రభుత్వాసుపత్రిలో అందని వైద్య సేవలు
- అన్ని వైద్య పోస్టులు ఖాళీ
- ఇబ్బందుల్లో రోగులు
- పట్టించుకోని అధికారులు



వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన రోగులు



రోగులకు మందులు రాస్తున్న ఆయుష్ వైద్యుడు

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరతతో పేద రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్పత్రిలో నలుగురు వైద్యులు ఉండాల్సింది ఏ ఒక్కరు పూర్తిస్థాయిలో ఉండక పోతుండడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. భీంగల్ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి నుంచి ఓ వైద్యురాలిని అధికారులు డిప్యుటేషన్‌పై ఇక్కడికి వేశారు. ప్రస్తుతం ఆ వైద్యురాలు మార్పు కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రిలో కాన్పులు చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆపరేషన్లు అధికం కావడంతో ఆ వైద్యురాలు మంగళవారం, గురువారం రెండు రోజులు మాత్రమే ఆపరేషన్లు చేస్తున్నారు. మరో ఇద్దరు వైద్యులు ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రి నుంచి రోజు తప్పించి రోజు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. డ్రాయింగ్ అధికారిగా ఉండాల్సిన డెంటిస్టును డిప్యుటేషన్‌పై జిల్లా ప్రభుత్వాసుపత్రికి పంపించారు. దీంతో వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి రోజుకు 200 మంది ఓపీ ఉంటుంది. కానీ వైద్యులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రసవాలు చేయాలంటే గైనకాలజిస్టు డిప్యుటేషన్‌పై వస్తున్నారు. కానీ మత్తు డాక్టర్‌ను అద్దెపై తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. ఆస్పత్రిని వైద్యవిధాన పరిషత్‌లోకి తీసుకొని రెండేళ్లు కావస్తున్నా ఇప్పటికి ఎలాంటి మార్పు రాలేదు. కానీ ఉన్న వైద్యులు మాత్రం లేకుండా పోయారు.

ఆయుష్ వైద్యుడితోనే ఓపీ సేవలు

ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉండటంతో పంటి నొప్పికి కంటి వైద్యం అన్న చందంగా ఆయుర్వేద వైద్యుడితో వైద్యం చేయిస్తున్నారు. ఆస్పత్రికి నిత్యం వచ్చే ఓపీని ఆయుష్ వైద్యుడు పరీక్షించి మందులు రాస్తున్నారు. ఆస్పత్రికి రోగులు ఏదైన పరిస్థితి విషమించి వస్తే ఇక అంతే సంగతి. క్లస్టర్ ఆస్పత్రిపై ఇంతలా నిర్లక్ష్యం తగదని మండల ప్రజలు పెదవి విరుస్తున్నారు. వైద్యుల కొరతపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫోనులో 'సాక్షి' సంప్రదించినా ఎలాంటి స్పందన ఇవ్వలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో వైద్యులను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైద్యులు లేక ఇబ్బందిగా ఉంది



ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు లేరు. దీంతో పేదలకు వైద్య సేవలు అందడం లేదు. రెండు రోజులకు ఒక వైద్యుడు వస్తున్నాడు. పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. సర్కార్ దవాఖానలకు రావాలంటేనే భయం వేస్తోంది.

– సల్లా నర్సయ్య, బాల్కొండ

ఘనంగా భీమా కోరేగావ్ శౌర్య దివస్



ఆర్మూర్‌లో నివాళులు అర్పించి క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో మాల సంఘాల జేఏసీ, అంబేడ్కర్ యువజన సంఘం, దళిత ఐక్య సంఘటన, యశోబుద్ధ ఫౌండేషన్, పలు దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ శౌర్య దివస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కో–చైర్మన్ అంగరి ప్రదీప్ మాట్లాడుతూ.. బ్రాహ్మణ పీష్వాలపై మహర్ రెజిమెంట్ పోరాట యోధుల యుద్ధ విజయానికి చిహ్నమే భీమా కోరేగావ్ శౌర్య దివస్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఇత్వార్‌పేట్ లింగన్న, కొక్కొర భూమన్న, జంగం అశోక్, గుమ్మడి చంద్రయ్య, కోటేశ్వర్, అర్గుల్ సురేశ్, లింగన్న, కొంతం మురళి, మార్ల ప్రభాకర్, పింజ భూమేశ్వర్, మాదరి రాజన్న, మట్లా అమృత్‌రావు, అబ్దుల్ హుస్సేన్, జిన్నా జనార్దన్, వికాస్, పూర్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

అమరులకు జోహార్లు

వేల్పూర్: భీమా కోరేగావ్‌లో మహర్ల అమరులై 207 ఏళ్ల అవుతున్న సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. దేశంలో ఉన్న దళిత బహుజనులు మహార్ల మరణాన్ని స్మరిస్తూ వారి ఆశయా సాధన కోసం దేశంలో ఉన్న దళిత బహుజనులు హాజరు కావాలని అంబేడ్కర్, దళిత సంఘం నాయకులు అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రభాకర్, బాబురావు, ప్రధాన కార్యదర్శి క్రాంతి, ప్రవీణ్, దళిత బహుజనులు, అంబేడ్కర్ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



వేల్పూర్‌లో నివాళులు అర్పిస్తున్న నాయకులు

కొవ్వొత్తుల ప్రదర్శన

రుద్రూర్: మండల కేంద్రంలో బుధవారం రాత్రి భీమా కోరేగావ్ శౌర్య దివస్ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం యువజన సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది సైనికులకు నివాళులు అర్పించడానికి వేలాది మంది ప్రజలు కోరేగావ్‌లో నిర్మించిన స్మారక స్తూపాన్ని సందర్శిస్తారని అన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం కార్యదర్శి నవీన్ కుమార్, సహాయ కార్యదర్శి కిశోర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



రుద్రూర్‌లో..

వాహనాల తనిఖీలు



మామిడిపల్లిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో పోలీసులు మంగళవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రమాదాలు జరగకుండా పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ.. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్‌లో..

బోధన్‌టౌన్: పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ నిర్వహించగా 26 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు. వాహనదారులు వాహన ధ్రువీకరణ పత్రాలను తమవద్ద ఉంచుకోవాలన్నారు.

నవీపేటలో..

నవీపేట: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్ బుధవారం తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు ఉల్లగించి, మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



పెర్కిట్: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వంతోనే దేశ అభివృద్ధి సాధ్యమని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ అన్నారు. ఆర్మూర్ మండలం ఇస్సాపల్లిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయాన్ని రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచడం సంతోషకరమన్నారు. అలాగే భారతదేశంలో రెండు కోట్ల ఇళ్ల నిర్మాణం చేయాలని ప్రధాని కంకణం కట్టుకున్నారని పేర్కొన్నారు. దీంతో పాటు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో రోడ్లు, సీసీ డ్రైనేజీలు, వైకుంఠధామాలు, స్వచ్ఛ భారత్ ద్వారా మరుగుదొడ్లు, చెట్ల పెంపకం చేపడుతున్నట్లు తెలిపారు. దీంతో పాటు నిరుపేదలకు ఉచితంగా రేషన్ బియ్యం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు బండి శ్రీహరి, డీసీ ముత్తెన్న, శెట్పల్లి ముత్తెన్న, సందుల ముత్తెన్న, కె ముత్తెన్న, కొడా నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో కుక్కల బెడద

- భయాందోళనలో స్థానికులు

రుద్రూర్: మండల కేంద్రంలో వీధి కుక్కల బెడద అధికమైంది. ప్రధాన, చిన్నచిన్న వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ కుక్కలు గుంపు గుంపులుగా తిరుగుతున్నాయి. రాత్రి వేళ ఒంటరిగా బయటకు రావాలంటేనే స్థానికులు జంకుతున్నారు. వాహనాల పై వెళ్లే వారిని వెంబడిస్తున్నాయి. దీంతో వాహన చోదకులు వేగంగా నడపడం వల్ల అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ సమీపంలోనే ఉర్దూ మీడియం స్కూల్ ఉంది. ఇక్కడ కుక్కల బెడద అధికంగా ఉంది. ఆలయ పూజారి గ్రామ పంచాయతీలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కానీ ఎలాంటి స్పందన లేదు. కుక్కలతో బడికి వచ్చే విద్యార్థులు, గుడికి వచ్చే భక్తులు బెంబేలెత్తుతున్నారు. ఒంటరిగా వస్తే పైకి వస్తున్నాయని వాపోతున్నారు. గతంలో కుక్కలను బంధించి అటవీ ప్రాంతాల్లో విడిచిపెట్టేవారు. ప్రస్తుతం అలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కుక్కలు దాడులు చేస్తుండడంతో పలువురు గాయాలపాలై ఆస్పత్రిలో చేరుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రుద్రూర్ బస్టాండ్ ప్రాంతంలో తిరుగుతున్న కుక్కలు

ఘనంగా అయ్యప్ప పడిపూజ



బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం అయ్యప్ప స్వామి సామూహిక మహా పడిపూజను గురుస్వామి రమణ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పమాలధారణ స్వాములు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పండితుడు గణేశ్ మహరాజ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ముంచుతున్న కమీషన్‌దారులు



సమావేశంలో మాట్లాడుతున్న వి ప్రభాకర్

ఆర్మూర్: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కమీషన్‌దారులు సిండికేట్‌గా మారి పసుపు రైతులను ముంచుతున్నారని అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవరాంతో కలిసి మాట్లాడారు. కమీషన్ దారులు ప్రతి ఏడాది సిండికేట్ అవతారం ఎత్తి కృత్రిమంగా ధరలు తగ్గించి రైతులను ఆర్థికంగా నష్టం చేస్తున్నారని పలుమార్లు ఆందోళనలు చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. గత నెల 19న రైతులను నష్టపరిచేలా సమావేశం నిర్వహించిన మర్చంట్ అసోసియేషన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేశ్, నాయకులు ఆకుల గంగారాం, ఇస్త్రారి రమేశ్, గంగాధర్, సాయిలు, శేఖర్ పాల్గొన్నారు.

9న రైతు డిమాండ్ డే



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

బోధన్: రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏఐయూకేఎస్ జాతీయ కమిటీ ఈ నెల 9న రైతు డిమాండ్ డే పేరిట ఆందోళనకు పిలుపు నిచ్చిందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ అన్నారు. దేశ వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం పట్టణ కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగు భూములకు రైతు భరోసా, ఆర్థికసాయాన్ని ఒకే దఫాలో ఇవ్వాలని, పంట రుణ మాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. జిల్లా ప్రతినిధులు పుట్టి నడ్పి నాగన్న, పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, బొంతల సాయిలు, సీతారాం, సురేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా న్యూఇయర్ వేడుకలు



పిప్రి చర్చిలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పాస్టర్ శేఖర్ ఇడ్విన్

పెర్కిట్: ఆలూర్ మండలంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ మండలం పిప్రి ఎల్ షద్దాయ్ చర్చిలో పాస్టర్ శేఖర్ ఇడ్విన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు గోక చిన్ని, పతాని సుమన్, చందు, నితిన్ పాల్గొన్నారు.



బోధన్‌లో దుస్తులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

వృద్ధులకు దుస్తులు పంపిణీ

బోధన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బోధన్‌కు చెందిన అమెరికాలో స్థిరపడిన ఆపులెంట్ సాఫ్ట్ కంపెనీ సీఈవో పవర్ రాజా పట్టణంలోని వృద్ధులకు దుస్తులు, పండ్లను బుధవారం పంపిణీ చేశారు. అదేవిధంగా ఆయన కుటుంబ సభ్యులు మోస్రా మండలంలోని చింతకుంట ఆశ్రమంలో వృద్ధులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు.

పెంచిన రేట్లను అమలు చేయాలి



సమ్మె చేస్తున్న కార్మికులు

ఆర్మూర్: సివిల్ సప్‌లై హమాలీ కార్మికులు గతంలో నిర్వహించిన కార్పొరేషన్ ముట్టడి ఫలితంగా పెంచిన రేట్లను తక్షణమే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ఆరెపల్లి సాయిలు డిమాండ్ చేశారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సివిల్ సప్‌లై హమాలీ కార్మికుల సమ్మెను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సమ్మెను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. గతంలో క్వింటాలుకు రూ.26 హమాలీ ఉండగా అధికారులు మూడు రూపాయలు పెంచినా అమలు చేయడం లేదన్నారు. సమ్మెలో నాయకులు మౌలానా, శ్రీకాంత్, ఫెరోజ్, రహీమ్, పరశురాం, బాలయ్య, మతిన్, నదీమ్, కిష్టయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

- స్క్రీన్-1 – క్రావెన్ ది హంటర్ (తెలుగు)-12.10, 6.35, 9.30; బేబీజాన్(హిందీ) - 3.05
- స్క్రీన్-2 – మార్కో (తెలుగు) - 10.00, 1.05, 7.05, 10.10; మ్యాక్స్ (తెలుగు) - 4.10
- స్క్రీన్-3 – పుష్ప-2 (తెలుగు) - 12.00; ముఫాసా (తెలుగు) - 4.25, 7.15, 10.05
- స్క్రీన్-4 ముఫాసా (తెలుగు) - 10.45; పుష్ప2 - 1.35, 6.00, 10.25

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 మాక్స్ (తెలుగు)-10.20 10.40 సై (తెలుగు) - 12.55; మార్కో (తెలుగు) - 4.05; పుష్ప-2 (తెలుగు)-6.55
- స్క్రీన్-2 ముఫాసా(తెలుగు)3డీ-10.35; మాక్స్ (తెలుగు) - 1.05; పుష్ప-2 (తెలుగు) - 3.45; మార్కో -7.40, 10.35
- స్క్రీన్-3 పుష్ప-2(తెలుగు)-1.05 9.50 ముఫాసా 3డీ- 5.00, 7.25

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 పుష్ప-2 (తెలుగు) - 10.20, 2.45; మార్కో (తెలుగు) - 7.10; ముఫాసా (3డీ ఇంగ్లీష్) - 10.15
- స్క్రీన్-2 ముఫాసా (3డీ తెలుగు) -11.00, 1.50, 4.40, 7.30; పుష్ప-2 (హిందీ) - 10.20
- స్క్రీన్-3 మార్కో (తెలుగు) - 11.05; పుష్ప-2 (హిందీ) - 2.10; పుష్ప-2 (తెలుగు) - 6.15; బేబీజాన్ (హిందీ) - 10.40
- స్క్రీన్ -4 క్రావెన్ ది హంటర్(తెలుగు) - 11.00 7.55; క్రావెన్ ది హంటర్ (ఇంగ్లీష్) - 5.00; మార్కో(తెలుగు) - 1.55, 10.50
- లలితామహల్ యుఐ (తెలుగు) - 11.15, 2.15; విడుదల2 (తెలుగు) - 6.15,9.15
- దేవి మార్కో-11.00 2.15 6.10 10.10
- నటరాజ్ మ్యాక్స్ (తెలుగు) - 2.00, 9.00; క్రావెన్ ది హంటర్(తెలుగు)- 11.00 6.00
- విజయ్ పుష్ప-2 (తెలుగు) - 10.30, 2.15, 6.10, 10.05

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,200	వెండి(కిలో)	91,000
22 క్యారెట్స్	73,075		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	160
	(కిలోకు)	లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800